# చదువుకుంటేనే చక్కటి భవిష్యత్


కొల్చారం: సంగాయి పేటలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్


పాపన్నపేట ఉన్నత పాఠశాలలో గులాబీ పూలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు



నిజాంపేట: నస్కల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు

- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి
- పాఠశాలలను పునఃప్రారంభించిన కలెక్టర్ రాహుల్ రాజ్
- సర్కారు బడుల్లో యూనిఫామ్‌లు అందజేత

కొల్చారం, జూన్ 12: చదువుకుంటేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మండలంలోని సంగాయిపేట, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, పాఠశాలలను ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, ఏకరూప దుస్తులు అందజేశారు. విద్యార్థులకు గణితంలో ప్రశ్నలు వేస్తూ వారి స్థాయిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. సీఎం సూచనల మేరకు బడిబాటను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం, తహసీల్దార్ గఫార్ మియా, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, జడ్పీటీసీ మేఘమాలసంతోష్ కుమార్, ఎంపీపీ మంజులా కాశీనాథ్, అమ్మా ఆదర్శ పాఠశాల చైర్మన్‌లు సంతోష, అనిత, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఏగొండ, ఇతర ఉపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గులాబీలతో స్వాగతం

పాపన్నపేట, జూన్ 12: పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గులాబీలతో బుధవారం స్వాగతం పలికారు. పాఠశాల ఎదుట మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు కట్టి బెలున్లతో అలంకరించారు. తరగతి గదుల ముందు ముగ్గులు వేశారు. మొదటి రోజు పుస్తకాలు పంపిణీ చేశారు.

### విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

నిజాంపేట, జూన్ 12: నిజాంపేట మండలంలోని నస్కల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ సిద్ధిరాములు పాఠ్యపుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం సత్యంరెడ్డి, గ్రామస్తులు లక్ష్మాగౌడ్, సంజీవ్, నర్సింహారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

### బడీడు పిల్లలను బడికి పంపాలి

చిలిపిచెడ్, జూన్ 12: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, బడిబాట విజయవంతంగా కొనసాగుతున్నదని మండల నోడల్ అధికారి,హెచ్‌ఎం విఠల్ పేర్కొన్నారు. చిలిపిచెడ్, చండూర్, చిట్కుల్, అజ్జమర్రి, సోమక్కపేట, ఫైజాబాద్ గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. చిలిపిచెడ్, చిట్కుల్, గౌతాపూర్, ఫైజాబాద్, చండూర్ ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు మండల నోడల్ అధికారి,హెచ్ విఠల్‌తో కలిసి ఐకేపీ ఏపీఎం ప్రేమలత విద్యార్థులకు బుధవారం యూనిఫామ్‌లు అందజేశారు. మండలంలో 2338 యూనిఫామ్‌లు అందించినట్లు తెలిపారు. ఐకేపీ సిబ్బంది పురుషోత్తం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

శివ్వంపేట, జూన్ 12: శివ్వంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్‌లను విద్యార్థులకు ఎంఈవో బుచ్యానాయక్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


చిలిపిచెడ్: సోమక్కపేటలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు


శివ్వంపేట: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ హరికృష్ణ, ఎంఈవో బుచ్యానాయక్


చిలిపిచెడ్‌లో యూనిఫామ్‌లు అందజేస్తున్న ఐకేపీ ఏపీఎం ప్రేమలత

# విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

**మెదక్ మండలం పెరూరులో రైతు, గాంధీనగర్‌లో మైక్ కడుతుండగా ఒకరు, వెల్దుర్తి మండలం రామాయిపల్లిలో బోరు రిపేరు చేస్తూ ఒకరు మృతి**

మెదక్‌రూరల్, జూన్ 12: పొలం పనులు చేస్తూ విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు కరెంట్ షాక్ తగలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పేరురూ గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరూర్‌కు చెందిన వెలమకన్నె నగేశ్ (48) పొలం వద్దకు వెళ్లి పనులు చేస్తున్న క్రమంలో అక్కడే స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరును పట్టుకున్నాడు. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు విద్యుత్ అధికారులకు సమాచారం తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే నగేశ్ మృతికి కారణమని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ధర్నాకు దిగారు. మెదక్, పాపన్నపేట రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రూరల్ సీఐ కేశవులు, విద్యుత్ ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ తిరుపతి రెడ్డి పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

**ఎమ్మెల్యే జోక్యంతో ఆందోళన విరమణ**

పేరూరులో ధర్నాకు దిగిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, మండల అధ్యక్షుడు శంకర్, ఎమ్మెల్యే రోహిత్‌కు తెలిపారు. విద్యుత్ షాకుకు గురైన రైతు నగేశ్‌కు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ ఇప్పిస్తానని, విద్యుత్ శాఖతో రూ.లక్ష ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.


వెల్దుర్తి: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కాలేరు ఆంజనేయులు


మెదక్ రూరల్: కరెంట్ షాక్‌తో మృతి చెందిన నగేశ్

**గాంధీనగర్‌లో..**

మెదక్ అర్బన్, జూన్ 12: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం గుట్ట కిందిపల్లి గ్రామానికి చెందిన చింతల నర్సింలు(38) గాంధీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద మైక్ కడుతుండగా గుడి పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

**రామాయిపల్లిలో..**

వెల్దుర్తి, జూన్ 12: వ్యవసాయ బోరుమోటర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామాయిపల్లిలో జరిగింది. వెల్దుర్తి ఎస్సై నవత తెలిపిన వివరాల ప్రకారం.. రామాయిపల్లికి చెందిన కాలేరు ఆంజనేయులు (45) విద్యుత్ మరమ్మతులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉప్పులింగాపూర్ శివారులోని పొలంలో బోరుమోటర్ వద్ద మరమ్మతులు చేయడానికి వెళ్లాడు. విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులకు ఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించి పంచనామా చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# పిడుగు పడి 41 గొర్రెలు మృతి


గొర్రెలు మృతి చెందడంతో బాధితులను పరామర్శించిన తహసీల్దార్, కౌన్సిలర్

రామాయంపేట, జూన్ 12: రామాయంపేట శివారులో బుధవారం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి 41 జీవాలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటలోని గాయంతి కనకరాజుకు చెందిన 13, మహేశ్ 14, మల్లయ్య 14 జీవాలు పట్టణ శివారులోని వెంకన్నగారి చెరువు వద్ద మేపుతున్నారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో వర్షం కురిసింది. దీంతో పిడుగు పడి 41 జీవాలు మృతి చెందాయి. దీంతో బాధితులకు సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి, తహసీల్దార్ రజినీకుమారి అక్కడకు వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ అందేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

రామాయంపేట, జూన్ 12: 108 సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని జిల్లా108 అంబులెన్సు ప్రోగ్రాం అధికారులు జనార్దన్, మహేశ్ తెలిపారు. బుధవారం రామాయంపేటలో అధికారులు అంబులెన్సు రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. అంబులెన్సు సిబ్బంది పరిసర మండలాల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఏక్షణం ఫోన్ కాల్ వచ్చినా వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఈఎంటీ స్వామి, పైలట్ అఫీస్ ఉన్నారు.


108 అంబులెన్స్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారులు

# వేర్వేరు ఘటనల్లో రెండు గేదెలు మృతి

చిలిపిచెడ్,జూన్ 12: పిడుగు పడి పాడి గేదె మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో జరిగింది. ఫైజాబాద్ గ్రామానికి చెందిన మ్యాకల శ్రీనివాస్ పాడి గేదెలు మేపుతూ జీవిస్తున్నాడు. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో గేదె చెట్టు కింద ఉండడంతో పిడుగు పడి మృతి చెందింది. గేదె విలువ సుమారు లక్షా 30వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న చిట్కుల్ వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్ ఘటనా స్థలానికి వెళ్లి గేదెను పరిశీలించిన పంచానామ చేశారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, జూన్ 12: కరెంటు షాక్‌కు గురై పాడి గేదే మృతి చెందిన ఘటన మండలంలోని ఖాజాపూర్ గిరిజన తండాలో బుధవారం జరిగింది. ఖాజాపూర్ గిరిజన తండాలోని ధరావత్ ఫకీరాకు చెందిన పాడి గేదే మేసుకుంటూ కరెంటు స్తంభం వైపు వెళ్లగా కరెంటు షాక్‌కు గురైన పాడి గేదే అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# చిన్నశంకరంపేటలో గాలివాన బీభత్సం


చిన్నశంకరంపేట మల్లుపల్లిలో గాలివానతో నివాస గృహాలపై నుంచి చెల్లాచెదురుగా ఎగిరిపడ్డ రేకులు

చిన్నశంకరంపేట, జూన్ 12: చిన్న శంకరంపేటతో పాటు మండలంలోని వివిధ గ్రామా ల్లో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గాలివానతో చెట్లు నేలకొరిగా యి. మల్లుపల్లి గ్రామానికి చెందిన పొన్నబోయిన నాగరాజ్, భూపాల్ నివాస గృహాల ఇంటి పైకప్పు, రేకులు ఎగిరిపోయాయి.


గాలివానతో కుప్పకూలిన హోర్డింగ్

# ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ రాహుల్ రాజ్**


కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్‌లో ఎంపికలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 12: గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం లక్కీడిప్ ద్వారా బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఎంపికైన వారు. ఇంగ్లిష్ మీడియంలో పూర్తి స్థాయిలో ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

**ఎంపికైన విద్యార్థులు..**

3వ తరగతిలో 13 సీట్లలో 33 శాతం రిజర్వేషన్ కోటాలో నలుగురు, జనరల్ కోటాలో నలుగురు బాలికలతో పాటు ఐదుగురు బాలురు, 5వ తరగతిలో 6 సీట్లకు ఇద్దరు బాలికలు, జనరల్ కోటాలో ఒక బాలిక, ముగ్గురు బాలురు, 8వ తరగతిలో 6 సీట్లకు ఇద్దరు బాలికలు, జనరల్ కోటాలో నలుగురు బాలురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం లలితాబాయి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనంతో గ్రామాలు కళ కళ లాడాలి


అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీశ్

మెదక్ రూరల్, జూన్ 12: గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో వికసించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్ అన్నారు. బుధవారం మండలంలోని మాల్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రం, డంపింగ్‌యార్డ్, నర్సరీ, పల్లెప్రకృతి వనం, అవెన్యూ ప్లానిటేషన్, పారిశుధ్య పనుల రికార్డ్‌లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించి హరితహారానికి సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దిగంబర్‌రెడ్డి తదితరులు ఉన్నారు

# నష్ట పరిహారం లెక్క తేల్చరే?


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 12: రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఎంత చెల్లిస్తారో లెక్కతేల్చాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని రైతులు నిలదీశారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం నర్సాపూర్‌లోని రైతు వేదికలో నాగులపల్లి, మహమ్మదాబాద్, తుజాల్‌పూర్, తిరుమలాపూర్, పెద్దచింతకుంట, ఖాజిపేట్, మూసాపేట్ గ్రామాల్లోని రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమ భూముల్లోని పైపులైన్లు, చెట్లు, బోర్లు, తదితర వివరాలను తమకు తెలుపాలన్నారు. ఎకరానికి ఎంత నష్టపరిహారం చెల్లిస్తారని ఆర్డీవోను అడుగగా ఎలాంటి వివరాలు తెలియదని ప్రభుత్వం నుంచి వివరా లు రాగానే తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పద్మ, అధికారులు, పాల్గొన్నారు.

# పిల్లలతో పని చేయిస్తే రెండేండ్ల జైలు శిక్ష


కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కార్మిక అధికారి సత్యేంద్రప్రసాద్

**- జిల్లా కార్మికశాఖ అధికారి సత్యేంద్రప్రసాద్**

చిన్నశంకరంపేట, జూన్ 12: పిల్లలతో పని చేయిస్తే రెండేండ్లు జైలు శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తామని జిల్లా కార్మికశాఖ అధికారి సత్యేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట గ్రామ శివారులోని మలానిఫోం పరిశ్రమలో బాల కార్మిక వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బాలలతో పనులు చేయించడం నేరమన్నారు. సమావేశంలో కార్మిక అధికారి రాజు, న్యాయవాదులు కరుణాకర్, సిద్దాగౌడ్, డీసీపీవో కరుణ, శ్రీకర్నాల్, అనుపమ్, భరత్‌రాజ్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభ్యున్నతికి పెన్ని పిక్స్‌కు శ్రీకారం


డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడుతున్న విద్యార్థి అనిక

మెదక్‌రూరల్, జూన్ 12: మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా విద్యార్థి అనిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ మహిళల వృత్తిని, ఆర్థిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పెన్ని ఫిక్స్ ప్రాజెక్టు తీసుకొచ్చింది ఇందులోభాగంగా బుధవారం మెదక్ మండలం మాచవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. పెన్నిపిక్స్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశాన్ని గ్రామీణ మహిళల వృత్తి, ఆర్థిక నైపుణ్యాన్ని మెరుగుపరిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. డాక్టర్ నారాయణ, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సాంబశివరావు, మహిళలు ఉన్నారు.

# తైబజార్ వేలం

చిన్నశంకరంపేట, జూన్ 12: చిన్నశంకరంపేట పట్టణ తైబజార్ వేలంపాటను పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈవో నాంపల్లి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేలంలో నిద్రబోయిన బాగులు రూ.6.80 లక్షలకు పాటపాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



### భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలి: సీపీఎం

నర్సాపూర్, జూన్ 12: ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఎంత పరిహారం ఇస్తున్నారో చెప్పకుండా, రైతులతో సమావేశాలు పెట్టడంలో అర్థమేంటని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు వేదికలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివిధ డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని నిర్వాసితులతో కలిసి అందజేశారు. సమావేశంలో నాగభూషణం, దుర్గేశ్, అంజయ్య, విఠల్, శివారెడ్డి, సంఘమేశ్వర్ పాల్గొన్నారు.

### పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

వెల్దుర్తి, జూన్ 12: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హస్తాల్‌పూర్‌లో బుధవారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందుల నర్సింలు (45) ఈ నెల 3న కూలీ పనులకు వెళ్లి, ప్రమాదశాత్తు బావిలో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలు కాగా ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న క్రమంలో బుధవారం ఉదయం గుండె పోటు రావడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### పాకిస్తాన్ దిష్టి బొమ్మ దహనం


పాకిస్తాన్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బజరంగ్ దళ్ కార్యకర్తలు

పాపన్నపేట్, జూన్ 12: వైష్ణో దేవి ఆలయానికి వెళ్తున్న భక్తులపై పాకిస్తాన్ ముష్కరులు జరిపిన దాడిని నిరసిస్తూ బజరంగ్‌దళ్ కార్యకర్తలు బుధవారం పాకిస్తాన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. బజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు బోల కృష్ణ మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌లోని వైష్ణోదేవి కత్రా నుంచి శివ్‌కోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై పాకిస్తాన్ ముష్కరులు జరిపిన దాడికి నిరసనగా పాకిస్తాన్ దిష్టి బొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, పవన్, బాగేశ్, శివ, నరేశ్ తదితరులు ఉన్నారు

### రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నర్సాపూర్, జూన్ 12: నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని మాదాపూర్‌కి చెందిన ఐదుగురు వ్యక్తులు ఏడపాయల దుర్గామాత దర్శనం చేసుకుని కారులో వస్తుండగా నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద లారీని ఢీకొన్నారు. దీంతో ఐదుగురి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించి చికిత్సనందించారు.

### నేడు బీజేపీ విజయోత్సవ ర్యాలీ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 12: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా విజయం సాధించిన రఘునందన్‌రావు విజయోత్సవ ర్యాలీని గురువారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు ఎమ్‌ఎల్‌ఎన్ రెడ్డి, కాశీనాథ్, సతీశ్, రంజిత్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి


పల్లె దవాఖానను పరిశీలిస్తున్న మెడికల్ అధికారి ప్రవీణ్

చిలిపిచెడ్, జూన్ 12: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని మండల మెడికల్ అధికారి ప్రవీణ్, సూపర్‌వైజర్ రమేశ్ అన్నారు. మండలంలోని చిట్కుల్ పల్లె దవాఖానను తనిఖీ చేశారు. కేంద్రంలో సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వానకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మెరుగైన సేవలు అందించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334230
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.